క్లుప్తంగా

అనంతపురం ఐటీఐలో నేడు జాబ్‌మేళా

బత్తలపల్లి: అనంతపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో మంగళవారం ఉదయం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామ మ్మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంకు చెందిన అమరరాజా ఎనర్జీ, మొబిలిటీ లిమిటెడ్ కంపెనీలో టెక్నీషియన్ల పోస్టుల భర్తీకి సంబంధిత అధికారులు హాజరై ఎంపిక చేస్తారన్నారు. ఐటీఐ పూర్తి చేసిన అందరు విద్యార్థులూ హాజరు కావచ్చన్నారు. ఐటీఐ చివరి సంవత్సరం పరీక్షలు రాస్తున్నవారు కూడా హాజరు కావొచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు వసతి, భోజన సదుపాయాలతో పాటు రూ.14 వేల వేతనం అందజేస్తారన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యేవారు తమ బయోడేటాతో పాటు అన్ని సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వడ్డెర ఓబన్న విగ్రహానికి విరాళం



ఏర్పాటు చేయనున్న ఓబన్న విగ్రహం

కదిరి అర్బన్: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డెర ఓబన్న విగ్రహానికి వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తల హరిప్రసాద్ రూ.1.20 లక్షల విరాళం అందజేశారు. ఈ విగ్రహాన్ని బస్టాండ్ వద్ద ఏర్పాటు చేయనున్నారు. బత్తల హరిప్రసాద్ మాట్లాడుతూ బ్రిటీష్ వారిని గడగడలాడించిన రేనాటి వీరుడు వడ్డెర ఓబన్న అని కొనియాడారు. ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసే అవకాశం దక్కడం తన అదృష్టమని పేర్కొన్నారు.

నేడు 'వికసిత్ ఆంధ్రప్రదేశ్'పై సమావేశం

తనకల్లు: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 'వికసిత్ ఆంధ్రప్రదేశ్' కార్యక్రమంపై అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి మృతి




మృతుడు శివయ్య (ఫైల్)

నల్లమాడ: నల్లసింగయ్యగారిపల్లికి చెందిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి చదివే శివయ్య (64) గుండెపోటుతో మృతిచెందారు. ఈయన కదిరి, పుట్టపర్తి డిపోల్లో విధులు నిర్వహించి కొన్ని నెలల క్రితం ఉద్యోగ విరమణ చేశారు. గ్రామ సమీపాన పొలంలో డ్రాగన్ ఫ్రూట్ పంట సాగు చేశారు. సోమవారం ఉదయాన్నే తోటలో ట్రాక్టర్‌తో సేద్యం చేయించారు. భార్య అన్నం తేవడానికి ఇంటికి వెళ్లగా... శివయ్య తోటలో నిర్మించిన షెడ్డులో ఉండిపోయారు. ఇంటినుంచి భార్య తిరిగివచ్చే సమయానికి శివయ్య గుండెపోటుతో మృతి చెందారు. ఈయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కదిరి ఆర్టీసీ డిపో మేనేజర్ మైనొద్దీన్, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు గోపాలకృష్ణ, బాషా, నరసింగరావు, సురేంద్రరెడ్డి తదితరులు శివయ్య మృతికి సంతాపం ప్రకటించారు.

ఇద్దరు వార్డు ఇన్‌చార్జ్‌ల సస్పెన్షన్

ధర్మవరం: వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణా నియమావళిని ఉల్లంఘించిన ఇద్దరు వార్డు ఇన్‌చార్జ్‌లను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈమేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు ఇన్‌చార్జ్ తొండమాల రవి, 31వ వార్డు ఇన్‌చార్జ్ మల్లివారి (తోపుదుర్తి) వెంకటరాముడులను వైఎస్సార్‌సీపీ నుంచి తొలగించినట్లు ప్రకటించారు.

ఉల్లాసంగా క్రికెట్ టోర్నీ



విజేతలకు ట్రోఫీలను అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: పట్టణంలోని ఎస్‌టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ఉపాధ్యాయ ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ ఆరోరోజు సోమవారం ఉల్లాసంగా సాగింది. తొలి మ్యాచ్‌లో నల్లచెరువు జట్టుపై గాండ్లపెంట జట్టు, రెండో మ్యాచ్‌లో తనకల్లు -2 జట్టుపై నల్లమాడ జట్టు, మూడో మ్యాచ్‌లో ఓడీసీ జట్టుపై తలుపుల జట్టు, నాలుగో మ్యాచ్‌లో ముదిగుబ్బ జట్టుపై తనకల్లు జట్టు విజయం సాధించింది. విజేతలకు తలుపుల ఎంఈఓ విజయ్‌కుమార్ ట్రోఫీ అందజేశారు.

రాష్ట్ర సదస్సుకు తరలి రండి

కనగానపల్లి: భూ కుంభకోణాలు, పేదల భూ ఆక్రమణలపై ఈ నెల 28న సీపీఐ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సుకు తరలిరావాలని ఆ పార్టీ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి మహదేవ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో సీపీఐ నాయకులు ప్రచారం నిర్వహించారు.



రాత్రి వేళల్లో భద్రత పెంచాలి

కోల్‌కతా వైద్య కళాశాలలో ట్రెయినీ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన యావత్ దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. అన్ని ఆస్పత్రుల్లో వైద్యులతో పాటు సిబ్బంది ప్రాణ రక్షణ, భద్రతకు ప్రభుత్వాలు ప్రత్యేక పోలీస్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేయాలి. బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద రాత్రి వేళల్లో మహిళలు విధులు నిర్వహించాలంటే భయంగా ఉంది. గ్రామానికి దూరంగా ఉండడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. దానికి తోడు మద్యం సేవించేందుకు ఈ పరిసరాలకు వస్తున్నారు. పోలీసులపై దాడి జరిగితే ఎలాంటి కేసులు ఉన్నాయో అలాంటి చట్టాలను వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడి చేస్తే కూడా అమలు చేయాలి. – రాఘవేంద్ర, ల్యాబ్ టెక్నీషియన్, పీహెచ్‌సీ, బత్తలపల్లి





నిందితులను కఠినంగా శిక్షించాలి

కోల్‌కతాలో జరిగిన ట్రైనీ వైద్యురాలిపై హత్యాచార ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. రాత్రి పూట విధులు నిర్వహించే వైద్యులకు రక్షణ కల్పించాలి. ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా ఆస్పత్రిలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి వైద్యులకు పూర్తి రక్షణ కల్పించాలి.

– డాక్టర్ శ్వేత, ముదిగుబ్బ



ఓడీచెరువు బస్టాండు కూడలిలో చిన్నారుల కోలాట ప్రదర్శన



ధర్మవరంలో ప్రబోధసేవా సమితి ఆధ్వర్యంలో పూజలు



కదిరిలో ఉట్టి కొడుతున్న కన్నయ్య



ఓడీ చెరువులో రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు



ముదిగుబ్బలో పూజలందుకున్న శ్రీకృష్ణుని ప్రతిమ

జయ కృష్ణా ముకుందా మురారి..

ధర్మవరం అర్బన్/ బత్తలపల్లి/ ఓడీచెరువు/ కదిరిటౌన్/ కదిరి అర్బన్/ గాండ్లపెంట/ నల్లచెరువు/ తనకల్లు/ నల్లమాడ/ ముదిగుబ్బ /పుట్టపర్తి టౌన్/ పుట్టపర్తి రూరల్ : దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం శ్రీమహావిష్ణువు ఎనిమిదో అవతారంగా అవతరించిన శుభ పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంతటా అంగరంగ వైభవంగా జరిగాయి. చిన్నారులకు రాధా గోపికలుగా వేషధారణ చేయించి తల్లులు మురిసిపోయారు. కన్నయ్య లీలలు తెలిపే ఘట్టాలు అలరించాయి. ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లో కృష్ణాష్టమి వేడుకలు గోకులాన్ని ప్రతిబింబించాయి. దేవాలయాలు, ఇస్కాన్ మందిరం, విద్యాసంస్థలతో పాటు ప్రధాన కూడళ్ల, ప్రత్యేక వేదికలపైన కృష్ణాష్టమి వేడుకలు అలరించాయి. ఉట్టికొట్టే కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.

శ్రీకృష్ణుని చిత్రపటం ఊరేగింపు

రామగిరి: రామగిరి, గరిమేకలపల్లి, గంతిమర్రి, పెద్దకొండాపురం, మంగాపురం గ్రామాల్లో సోమవారం శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని ఊరేగించారు. మాదాపురం, నసనకోట, పోలేపల్లి, కుంటిమద్ది, పేరూరు గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చెన్నేకొత్తపల్లి: చెన్నేకొత్తపల్లిలో ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శ్రీకృష్ణుడి విగ్రహాన్ని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే మండల కేంద్రంలోని శ్రీకృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

కనగానపల్లి: కనగానపల్లి, బద్దలాపురం, భానుకోట, పాతపాళ్యం గ్రామాల్లో భక్తులు మండపాల్లో శ్రీకృష్ణుడి ప్రతిమలు కొలువుదీర్చారు. బాలేపాళ్యం శారదాపీఠంలో భగవద్గీత పారాయణం చేయించారు.

ప్రశాంతి నిలయంలో కృష్ణాష్టమి

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఉదయం గోకులం నుంచి ప్రత్యేకంగా అలంకరించిన గోవులను, పశు పక్ష్యాదులను వేదమంత్రోచ్చరణ నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి సత్యసాయి మహాసమాధి చెంత ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి పలువురు సభ్యులు గోవులకు పాలు తాపిస్తూ పండ్లు తినిపిస్తూ గోసేవ నిర్వహించారు. సంగీత కళాశాల విద్యార్థులు భక్తిగీతాలు ఆలపించారు.

పరవశభరితం 'సంకీర్తన సాక్షాత్కారం'

పాండురంగ స్వామి పరమభక్తుడు చోకా మేళుని చరిత్రను వివరిస్తూ సత్యసాయి భక్తులు నిర్వహించిన సంకీర్తన సాక్షాత్కారం సంగీత నృత్యనాటిక భక్తులను పరవశింపజేసింది.



పుట్టపర్తిలో రాధాకృష్ణ వేషధారణతో రత్నాకర్





పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో 'సంకీర్తన సాక్షాత్కారం' నాటికలోని ఘట్టాలు



ధర్మవరం ఇస్కాన్ మందిరంలో ప్రత్యేక అలంకరణ



నల్లమాడ మండలం గోపేపల్లిలో గోపికాకృష్ణులు



నల్లచెరువులో వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు



బత్తలపల్లిలో శ్రీకృష్ణుని విగ్రహానికి పూజలు చేస్తున్న దృశ్యం

పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

తాడిమర్రి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రజలకు ప్రమాదం పొంచి ఉంది. కాలనీలో దాదాపు 400 కుటుంబాలు నివసిస్తున్నాయి. రెండు 25 కేవీ (టిన్) ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఇందులో కునుకుంట్ల రోడ్డులో తక్కువ ఎత్తులో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ఈ రహదారి గుండా తాడిమర్రి నుంచి కునుకుంట్ల, రామాపురం, గూగూడు, నార్పల తదితర గ్రామాలకు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఏమరుపాటుగా ఉంటే విద్యుత్ తీగలు తగిలి ప్రమాదానికి గురయ్యే అవకాశముంది. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

బత్తలపల్లి: కాటమకుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దొడ్డావుల గోపాల్‌రెడ్డి(60) గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతి చెందారు. సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు గోపాల్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొల్లపల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ ముదిగుబ్బ మండల కన్వీనర్ సీపీ రెడ్డి, బత్తలపల్లి మండల మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, మాజీ సర్పంచ్ గొల్లపల్లి నరసింహారెడ్డి, నాయకులు ముష్టూరు నరసింహారెడ్డి, జాంపుల చంద్రమోహన్, ఓంప్రసాద్ రెడ్డి తదితరులు ఉన్నారు.


రేపటి నుంచి కొల్లాపురమ్మ విగ్రహ ప్రతిష్ట

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న కొల్లాపురమ్మ ఆలయ పునఃనిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. కొల్లాపురమ్మ దేవాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో అదే ప్రాంతంలో నూతన దేవాలయాన్ని నిర్మించేందుకు గ్రామస్తులు తీర్మానించారు. దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు కలసి భక్తుల నుంచి విరాళాలు సేకరించారు. ప్రస్తుతం ఆలయ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌ను ప్రతిష్ఠించేందుకు ఈనెల 28 నుంచి 30 వరకూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు వేద బ్రాహ్మణుల ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించిన అనంతరం 30వ తేదీ ఉదయం అమ్మవారి మూల విరాట్‌ను ప్రతిష్ఠిస్తామని పేర్కొన్నారు.


బైకును ఢీకొన్న కారు

తనకల్లు: కోటూరు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తనకల్లుకు చెందిన రామకృష్ణ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ద్విచక్రవాహనంపై వెళుతుండగా కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు గమనించి రామకృష్ణను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారు.

ఆశాజనకంగా ఖరీఫ్ పంటలు



కోటపల్లి వద్ద సాగులో ఉన్న వేరుశనగ



పెద్దపల్లి వద్ద ఆశాజనకంగా ఉన్న సజ్జ పంట

తనకల్లు: ఖరీఫ్ పంటలు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. మండలంలో 7,408 హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణం ఉంది. ప్రధానంగా వేరుశనగ, కంది, సజ్జ, మొక్కజొన్న, టమాట, పెసర తదితర పంటలు సాగు చేస్తారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో, తెగుళ్ల, కూలీల ఖర్చులు ఇలా పంట పెట్టుబడి పెరిగిపోవడంతో ఏ యేటికాయేడు ఖరీఫ్ సాగు విస్తీర్ణం తగ్గిపోతూ వస్తోంది. ఈ ఏడాది వేరుశనగ 2,915 హెకార్లు, కంది 195 హెక్టార్లు, టమాట 277 హెక్టార్లు, మొక్కజొన్న 216 హెక్టార్లు, సజ్జ 24 హెక్టార్లు, పొద్దుతిరుగుడు 15 హెక్టార్లు చొప్పున మొత్తం 3,758 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. జూలై, ఆగస్టు నెలల్లో మంచి వర్షాలు పడడంతో పంటలు కళకళలాడుతున్నాయి. ప్రస్తుతం వేరుశనగ పూత, ఊడల దశలో ఉంది. అంతర్ పంటలుగా కంది, పెసర, అలసంద సాగు చేశారు. వారం రోజుల క్రితం కురిసిన వర్షాలు పంటలకు ప్రాణం పోశాయని రైతులంటున్నారు.

ఓపీఎస్‌నే అమలు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి

ధర్మవరం అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్)నే అమలు చేయాలని, ఇతర ఏ స్కీములూ వద్దని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో సోమవారం ధర్మవరం జోన్ యూటీఎఫ్ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యుపీఎస్)ను దేశవ్యాప్తంగా అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. యూపీఎస్ అమలు వల్ల ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు అదనంగా ఎలాంటి ప్రయోజనమూ లేదని విమర్శించారు. సీపీఎస్, జీపీఎస్‌లను ప్రభుత్వం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమాలను చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రామకృష్ణనాయక్, ఆంజనేయులు, అమర్‌నారాయణరెడ్డి, లక్ష్మయ్య, సకల చంద్రశేఖర్, రామంజనేయులు, సాయిగణేష్, ఆదిరెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆధారాలు అందజేయాలి

నల్లమాడ: నల్లమాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ)లో లావాదేవీలను కంప్యూటరీకరణ చేస్తున్నట్లు సీఈఓ బి.కేశవులు, పర్సన్ ఇన్‌చార్జ్ అమరనాథ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సహకార సంఘంలో సభ్యత్వం ఉన్న రైతులందరూ తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, రేషన్, పాన్ కార్డుల నకళ్లతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను మూడు రోజుల్లోపు అందజేయాలని సూచించారు.

కొనసాగుతున్న పునఃపరిశీలన

బత్తలపల్లి: ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల పునఃపరిశీలన ప్రక్రియ మండలంలో సోమవారం కూడా కొనసాగింది. ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ నటరాజన్‌తో పాటు మరో నలుగురు తహసీల్దార్ల ఆధ్వర్యంలో పరిశీలన కార్యక్రమం జరుగుతోంది. భూములకు సంబంధించిన రైతులతోనూ, కొనుగోలుదారులతోనూ వివరాలను సేకరించారు.

చేనేత పరిశ్రమ పరిరక్షణకు కృషి

ధర్మవరం రూరల్: చేనేత పరిశ్రమ పరిరక్షణకు కృషి చేస్తామని, నేతన్నలకు అండగా ఉంటామని చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు తెలిపారు. సోమవారం ధర్మవరంలోని సీపీఐ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కొంతమంది మరమగ్గాలను ఏర్పాటు చేసుకొని విచ్చలవిడిగా ఉత్పత్తులు తయారు చేస్తూ తోటి నేతన్నల కడుపు కొడుతున్నారన్నారు. ఇలాంటి వ్యక్తుల వల్ల ఇప్పటికే చితికిపోయిన పరిశ్రమ పూర్తిగా నిర్వీర్యమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. చేనేత మంత్రి సవిత, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ స్పందించి చేనేత పరిశ్రమను కాపాడి పవర్ లూమ్స్ మగ్గాలపై తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు వెంకటస్వామి, సీపీఐ పట్టణ కార్యదర్శి రవి కుమార్, సహాయ కార్యదర్శి రమణ, కార్యవర్గ సభ్యులు ఆదినారాయణ, శ్రీధర్, శ్రీనివాసులు, బాల రంగయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మహిళా బ్యాంక్ ఏర్పాటు



ఆదర్శ మహిళా కో ఆపరేటివ్ బ్యాంకు సభ్యులతో విశాల ఫెర్రర్

నల్లమాడ: మండల కేంద్రం నల్లమాడలో ఆదర్శ మహిళా కో ఆపరేటివ్ బ్యాంక్‌ను సోమవారం ఆర్డీటీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల కోసం వారే సొంతంగా ఏర్పాటు చేసుకున్న బ్యాంక్ ఆదర్శ మహిళా కో ఆపరేటివ్ బ్యాంక్ అని అన్నారు. ఇందులో ప్రతి మహిళా యజమానురాలేనన్నారు. మహిళల అవసరాల కోసం బ్యాంక్ నుంచి త్వరితగతిన రుణం పొందవచ్చన్నారు. బోర్డు డైరెక్టర్లు బ్యాంక్‌ను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. మహిళలందరూ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని విశాల ఫెర్రర్ ఆకాంక్షించారు. కదిరి రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ, ఏటీఎల్‌లు వన్నూరుస్వామి, బాషా, నరసింగరావు, లక్ష్మన్న, రాంప్రతాప్‌రెడ్డి, కేశవమూర్తి, తిప్పమయ్య, సిబ్బంది శ్రీనివాసులు, గంగప్ప, నరసింహులు, కుళ్లాయమ్మ, గీతా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

బత్తలపల్లి: చిత్రావతి నది నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం రామాపురం వద్ద ఎస్ఐ శ్రీనివాసులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇసుక రీచ్ పాయింట్‌లు, స్టాక్ పాయింట్ల వద్ద మాత్రమే ఇసుక తీసుకెళ్లాలని ఎస్ఐ సూచించారు. రసీదులు లేకుండా ఇసుక తరలిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అక్రమంగా తరలిస్తే వాహనాలు సీజ్

చిత్రావతి నది నుంచి గానీ, ఇతర ప్రాంతాల నుంచి గానీ ఇసుకను అక్రమంగా తరలిస్తే సదరు వాహనాలను సీజ్ చేస్తామని ఎస్ఐ పి.శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం చిత్రావతి నదిలో ఇసుకను అక్రమంగా తరలించకుండా ఉండేందుకు జేసీబీ సాయంతో నది వద్ద ట్రెంచ్ తవ్వించారు.

సీఐ సురేష్‌కు సన్మానం



సీఐ సురేష్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ, నాయకులు

పుట్టపర్తి: పుట్టపర్తి రూరల్ సీఐ సురేష్‌ను బుక్కపట్నం ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ భర్త గోవర్ధన్‌రెడ్డి తదితరులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు రామలింగారెడ్డి, మండల బూత్‌లెవల్ మేనేజర్ పతంజలి, మైనార్టీ విభాగం మండల కన్వీనర్ ఖదీర్, ఎస్సీ కాలనీ బూత్ కన్వీనర్ నీలూరి ఈశ్వర్, యూత్ నాయకుడు నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.